క్లుప్తంగా

విద్యార్థుల ఎడ్యుకేషనల్ టూర్



విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎడ్యుకేషనల్ టూర్‌కు వెళ్లారని ప్రిన్సిపల్ సుజాత పేర్కొన్నారు. తిరుపతిలోని సైన్స్ సెంటర్, చంద్రగిరి కోట, శ్రీనివాసమంగాపురంలోని ఆలయం తదితర ప్రాంతాలను సందర్శించారని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ మధు తదితరులు పాల్గొన్నారు.

జగదేవిపేట పీహెచ్‌సీలో పరిశీలన



ఇందుకూరుపేట: జగదేవిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నోడల్ అధికారి డాక్టర్ దయాకర్ శుక్రవారం పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించారు, ఫార్మసీ గదిలో మందులను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆరోగ్య సేవలను పక్కాగా అందించడంతో పాటు రికార్డులను సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో 60 రకాల రక్త పరీక్షలను చేస్తున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు



మాట్లాడుతున్న సురేష్‌బాబు

ముత్తుకూరు: పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక వైద్య నిపుణుడు సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదువుతూ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసులు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సెట్నెల్ సీఈఓ నాగేశ్వరావు, మేనేజర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ

కోవూరు: అనంతపురం జేఎన్టీయూ పరిధిలో సౌత్ జోన్ స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో వివిధ అంశాల్లో గంగవరంలోని గీతాంజలి కళాశాల విద్యార్థులు తొమ్మిది మంది సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో అభినందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నార్తురాజుపాళెంలో మానవహారం

కొడవలూరు: రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన అవసరమని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ర్యాలీ, మానవహారాన్ని కొడవలూరు పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని కోరారు. కొడవలూరు సీఐ సురేంద్రబాబు, ఎస్సైలు కోటిరెడ్డి, నరేష్, ఏఎస్సై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



కలువాయిలో తనిఖీ చేస్తున్న మహబూబ్‌బాషా

కలువాయి: ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు జిల్లా అటవీ శాఖాధికారి ఎస్‌కే మహబూబ్‌బాషా తెలిపారు. పట్టా భూముల్లో పెంచిన ఎర్రచందనం చెట్లు కొట్టేందుకు అనుమతులు కోరిన నేపథ్యంలో ఆయన శుక్రవారం కలువాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి రేంజ్‌ల పరిధిలో ఎర్రచందనం చెట్లు ఉన్నాయన్నారు. వాటి రక్షణకు బేస్ క్యాంపులు, స్ట్రైకింగ్ ఫోర్సు, రెగ్యులర్ సిబ్బందితో కూంబింగ్ చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్సు టీమ్ తెగచర్ల, గోనుపల్లి ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రాపూరు, కలువాయి అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోరెత్తిన నిరసన

- పేదలపై ప్రతాపమేమిటి..?
- నిలదీసిన మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న కాకాణి, నల్లపరెడ్డి, నేతలు

కొడవలూరు: కొడవలూరులో అధికార పార్టీ నేతల అరాచకాలను నిరసిస్తూ మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన మహాధర్నా సందర్భంగా నిర్వహించిన ర్యాలీ హోరెత్తింది. వేలాది మంది పార్టీ శ్రేణులు ర్యాలీకి తరలివచ్చారు. కొడవలూరులోని పెట్రోల్ బంక్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. చిరుద్యోగుల తొలగింపు, మహిళా సర్పంచ్‌లపై వేధింపులకు వ్యతిరేకంగా ర్యాలీలో నినాదాలు హోరెత్తాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలపై అధికార పార్టీ నేతలు విరుచుకుపడి వారి కడుపుకొట్టడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేదలు వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటే వారికి రాజకీయ రంగు పులిమి నిర్దాక్షిణ్యంగా తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోకి ఏ పార్టీ వారైనా స్వేచ్ఛగా రావొచ్చని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇవి కేవలం టీడీపీకి చెందిన వారికే అనే తరహాలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికార యంత్రాంగమంతా టీడీపీ నేతల్లా వ్యవహరిస్తుంటే, ప్రజాస్వామ్యం ఏమైందనే సందేహం కలుగుతోందని తెలిపారు. అనంతరం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల వింత పోకడను గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు మనుగడ సాగించాలంటే టీడీపీలోనే ఉండాలని, లేని పక్షంలో ఇబ్బందులేనని బాహాటంగా హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నేతల అవినీతి, అక్రమాలను ప్రశ్నించేవారు లేకుండా చేయడమే లక్ష్యంగా సాగుతున్నారని, ఇలాంటి వారికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నేతలు మాణిక్యరావు, కరిముల్లా, సతీష్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మల్లికార్జున, మారంరెడ్డి రంగారెడ్డి, శివుని నరసింహారెడ్డి, చక్కా మనోహర్, బాలభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో ప్రసన్న



కార్యాలయం వద్ద పోలీసుల మోహరింపు



ర్యాలీ సమయంలో 108 రాగా, దారిచ్చి పంపుతున్న నేతలు

దిగజారుతున్న నిమ్మ ధరలు



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: సంక్రాంతి తర్వాత నిమ్మకాయల దిగుబడి పెరగడంతో ధరలు దిగజారుతున్నాయి. సీజన్‌లో కాయల దిగుబడి తగ్గే అవకాశం ఉందని పూత సక్రమంగా పూయడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్న తరుణంలో ప్రస్తుతం ఉన్న ధరలు కూడా దిగజారుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగ తర్వాత పిందెలు కాయలుగా మారడంతో రైతులు మార్కెట్‌కు పెద్ద సంఖ్యలో తరలించడం వల్ల ఎగుమతులు పెరిగి ధరలు తగ్గుతున్నట్టు వ్యాపారులు వెల్లడిస్తున్నారు.

ఇంకా తగ్గే అవకాశం

ప్రస్తుతం పొదలకూరు ప్రభుత్వం నిమ్మ మార్కెట్ యార్డులో అధికంగా రూ.2,400 ఉండగా ప్రారంభ ధరలు రూ.1,400గా ఉన్నాయి. కిలోల వంతున చూసుకుంటే రూ.18 నుంచి రూ.30 మాత్రమే ఉన్నట్టు తెలుస్తోంది. కాయలు మార్కెట్‌కు విపరీతంగా వస్తున్న నేపథ్యంలో ఇంకా ధరలు తగ్గే అవకాశం కూడా ఉందంటున్నారు. దీనికితోడు పండు కాయలు అధికంగా మార్కెట్‌కు వస్తున్నాయి. సంక్రాంతి తర్వాత కోయొచ్చని కొందరు రైతులు అనుకున్నారు. ప్రస్తుతం కోసిన స్వల్ప వ్యధిలోనే గ్రీన్ నుంచి ఎల్లో కలర్‌కు మారి పండుగా తయారవుతున్నాయి. ఇందువల్ల ఎగుమతులు ఇబ్బందులకు ఏర్పడుతున్నట్టు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ఇప్పుడిప్పుడే పూత పెడుతున్న చెట్లు ధరలు పలికే వేసవి కాలంలో అందుబాటులోకి రావని రైతులు అల్లాడుతున్నారు.

ఢిల్లీ మార్కెట్‌కు భారీగా..

తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం ప్రస్తుతం నిమ్మకాయలు ఢిల్లీ మార్కెట్‌కు వెళుతున్నాయి. ఫలితంగా ఎగుమతులు బాగా పెరిగి ఇక్కడ కాయలకు ధరలు లభించడం లేదని తెలుస్తోంది. సాధారణంగా తమిళనాడు రాష్ట్రంలో నిమ్మకాయలు ఆశించిన స్థాయిలో దిగుబడి కావు. ఈ ప్రాంతంలో ఏడాది మొత్తం తక్కువ, ఎక్కువ స్థాయిలో కాయలు దిగుబడి అవుతూనే ఉంటాయి. అయితే తమిళనాడులో ప్రస్తుతం కాయలు ఉండటంతో ఎగుమతులు పెరుగుతున్నాయి. దీంతో ధరలు పతనం అవుతున్నట్టు వ్యాపారులు వెల్లడిస్తున్నారు.

మెరుగైన విద్యాబోధనే లక్ష్యం

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: మెరుగైన విద్యాబోధనే లక్ష్యంగా అధ్యాపకులు పని చేయాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో శుక్రవారం అంతర్జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడంలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో పరిశోధన, సృజనాత్మకత ప్రాముఖ్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి అందె ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

➡ వీఎస్‌యూలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్య చదివేందుకు ఆసక్తి చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, డాక్టర్ పసుపులేటి వసుమతి, డాక్టర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ



కోవూరు: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కోవూరు డివిజన్ నూతన కమిటీ సమావేశాన్ని పట్టణంలోని పద్మావతి ఫంక్షన్ హాల్లో రీజినల్ సెక్రటరీ కొండపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కరాది అజిత్‌కుమార్‌రెడ్డి, డివిజనల్ సెక్రటరీగా శింగంశెట్టి శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మావిళ్ల కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బండి వివేకానందరెడ్డి, ట్రెజరర్‌గా మహేష్ తదితరులు ఎన్నికయ్యారు. వీరిని సత్కరించారు. అనంతరం ఈఈని కలిశారు. గూడూరు డివిజన్‌కు చెందిన శివశంకర్, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరులో రక్తదాన శిబిరం



ముత్తుకూరు: నేస్తం ఫౌండేషన్ – ఆర్‌వైఎస్ టీమ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ముత్తుకూరు రెవెన్యూ కార్యాలయం వెనుక మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జి.వేణుగోపాలరావు తదితరులు ముఖ్యఅతిథులుగా విచ్చేసి నిర్వాహకులను, రక్తదాతలను అభినందించారు. 150 మందికిపైగా యువకులు రక్తదానం చేశారు. నాయకులు ఈదూరు రామమోహన్‌రెడ్డి, పోర్టు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన సదస్సు



కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెంలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు డీఈఈ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. ఈ పథకాన్ని సబ్సిడీ ద్వారా పొందవచ్చని చెప్పారు. ఏఈ గిరిధర్, తిరుమూరు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో కిందపడి..

- వ్యక్తి మృతి



బుచ్చిరెడ్డిపాళెం: నిద్ర మత్తులో కిందపడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన జొన్నవాడలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతుడ్ని అల్లూరు మండలం నార్తు ఆములూరుకు చెందిన మురళి (46)గా గుర్తించారు. కోట మండలంలో అగ్నిమాపక దళంలో పనిచేస్తూ ఏడాదిన్నరగా సస్పెన్షన్లో ఉన్నారనే విషయం అధికారుల ద్వారా తెలిసిందని ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు. జొన్నవాడలో ఆర్నెల్లుగా ఉంటూ బేల్దారి పనులతో పాటు ఆటో నడుపుతూ మద్యం సేవించి బయట పడుకునేవారని స్థానికులు తెలిపారన్నారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు



మందులు పంపిణీ చేస్తున్న అధికారులు



మనుబోలు: దూడకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాచలం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఈదగాలి గ్రామంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఏడీఏ డాక్టర్ గురువారెడ్డి పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జునరెడ్డి, పూడిపర్తి పశువైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ ఝాన్సీరాణి, సిబ్బంది కవిత, మాలతి, స్వర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామం పశువైద్యశాలలో శుక్రవారం పశు వైద్యశిబిరాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా 125 దూడలకు మందులను అందజేశారు. లేగదూడల అందాల పోటీల్లో విజేతలుగా నిలిచిన 45 మంది రైతులకు బహుమతులను అందజేశారు. గ్రామంలో రెండు వీధుల్లో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ నాయక్, డీఎల్‌డీఏ శ్రీనివాసరావు, డీడీ ఎం.నాగమణి, పొదలకూరు ఏడీ డాక్టర్ కె.అరుణ, పశువైద్యాధికారి సి.మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

➡ తోటపల్లిగూడూరు: మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం జరిగింది. మండల పశువైద్యాధికారి శ్రీనివాసరావు రైతులకు సూచనలిచ్చారు. 71 లేగదూడలకు, 149 పెద్ద పశువులకు డీవార్మింగ్ మందులను పంపిణీ చేశారు. నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు వెంకటరత్నం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

➡ మనుబోలు: పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ షరీఫ్ అన్నారు. మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ గొర్రెలు, మేకలు, పెద్ద పశువులు, దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. సిబ్బంది కల్యాణి, కామక్షమ్మ, మస్తానయ్య, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, సీఐ తదితరులు



తోటపల్లిగూడూరు సెంటర్‌లో బైక్ ర్యాలీ

పొదలకూరు: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండలంలోని తాటిపర్తిలో శుక్రవారం పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే హనీఫ్, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

➡ తోటపల్లిగూడూరు: రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం తోటపల్లిగూడూరు మండల కేంద్రంలో మోటార్‌బైక్ ర్యాలీ జరిగింది. ఎస్సై వీరేంద్రబాబు మాట్లాడుతూ వాహనదారులు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన అవసరం



కొడవలూరు: హైస్కూల్లో ర్యాలీ



ఇందుకూరుపేటలో..



కొడవలూరు: యల్లాయపాళెంలో మానవహారం



విడవలూరులో..



తోటపల్లిగూడూరు: వరిగొండలో..

ఇందుకూరుపేట: బాలికల హక్కులపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, ఆదెమ్మసత్రం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పాఠశాలలో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ర్యాలీని జరిపారు.

➡ విడవలూరు: బాలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు సుమిత్ర, రమణి పేర్కొన్నారు. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీ పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు జరిపారు. అనంతరం కిశోరి వికాసం పోస్టర్లను ప్రధానోధ్యాయుడు రమేష్ ఆవిష్కరించారు.

➡ కొడవలూరు: కొడవలూరు హైస్కూల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల.. యల్లాయపాళెం హైస్కూల్లో పద్మావతి.. గండవరం హైస్కూల్లో సూపర్‌వైజర్ నాగభూషణమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. హెచ్‌ఎంలు మోహనరామలింగయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

➡ పొదలకూరు: మండలంలోని తోడేరు కాకాణి శేషమ్మ జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ డి.పద్మజ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఆమె మాట్లాడుతూ బాలబాలికలను సమానంగా చూడాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

➡ మొగళ్లూరు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో అంగన్‌వాడీ టీచర్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో విద్యార్థినులు మానవహారం నిర్వహించారు.

➡ మనుబోలు: విద్యతోనే ఆడపిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బద్దెవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, అంగన్‌వాడీలు రాధ, రమణమ్మ, ముత్యాలమ్మ, కల్పన, ఉమామహేశ్వరి, దొరసానమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ తోటపల్లిగూడూరు సెక్టార్ సూపర్‌వైజర్ రంగమ్మ మాట్లాడారు. విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పేడూరు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విజిత, అంగన్‌వాడీ టీచర్లు సునీత, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరు: బాలికల దినోత్సవ ర్యాలీ



పొదలకూరు: మొగళ్లూరులో మానవహారం



మనుబోలు: బాలికలతో ర్యాలీ